క్లుప్తంగా

నేటి నుంచి శౌర్య జాగరణ యాత్రలు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ - బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి అక్టోబర్ 14వ తేదీ వరకు 'శౌర్య జాగరణ యాత్ర' నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. యాత్రకు రక్షణ కల్పించాలని కోరుతూ వీరు శనివారం జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్‌కు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, బజరంగ్ దళ్ కర్నూలు విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ, జిల్లా కన్వీనర్ రాజేష్, నగర కన్వీనర్ భగీరథ, నాయకులు సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త ఎస్.శివప్రసాద్ తెలిపారు. 'సాంస్కృతిక కాలుష్యం' అనే అంశంపై వికాస భారతి సంఘటనా కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, 'భావి తరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో మన పాత్ర' అనే అంశంపై డాక్టర్ గరికిపాటి గురజాడ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం భారత్

కర్నూలు కల్చరల్: ప్రపంచ దేశాలకు భారత దేశం ఆదర్శంగా నిలుస్తుందని బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ రంగస్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీసాల ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా శనివారం బీజేపీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు బీజేపీ కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ, రాష్ట్ర నాయకులు సందడి సుధాకర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాలతి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, సూర్యకుమార్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శులు గీతమాధురి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాసులు, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కటిక ప్రసాద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు సీసీ కెమెరాలు

కర్నూలు సిటీ: నగరంలోని బీక్యాంపులో ఉన్న కాలేజీ బాలికల సోషల్ వెల్ఫేర్ హాస్టల్-1కు శుక్రవారం కాంకర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో సీసీ కెమెరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆ సొసైటీ అధ్యక్షుడు కొంకతి వేణుగోపాల్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్యాముల్, సాయి ప్రదీప్ చేతుల మీదుగా 8 సీసీ కెమెరాలు, కంప్యూటర్ తదితర పరికరాలను ఆ హాస్టల్ వార్డెన్ బెన్నెమ్మకు అందజేశారు. బాలికల భద్రత దృష్ట్యా ఈ సీసీ కెమెరాలను అందజేసినట్లు సొసైటీ అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు (న్యూసిటీ) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. ఎన్ఎస్ఎస్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వర్సిటీలో స్వచ్ఛతాహి సేవాపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డాక్టర్ జేఎండీ షఫీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళి

కర్నూలు సిటీ: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతిపై సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో అధ్యాపకులు సంతాపం ప్రకటించారు. ఆ కాలేజీ ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ కె.చిన్న నారాయణ స్వామినాథన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి. సుబ్రమణ్య కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.ఆర్. ప్రసాద్ రెడ్డి, ఆర్థిక శాఖ విభాగం అధ్యక్షుడు డా.ఎల్లా కృష్ణ, అధ్యాపకులు సవిత, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

కర్నూలు సిటీ: కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో పీడీఎస్‌యూ రెండో ప్లీనరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు తీసుకురావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పురుషోత్తం, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సంతృప్తికరంగా వైద్యసేవలు

- ఆరోగ్య సురక్ష క్యాంపులను విజయవంతం చేయాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్, ప్రజా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు వచ్చిన రోగులకు సంతృప్తికరంగా వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మెడికల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లతో శుక్రవారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సురక్ష క్యాంపులను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రోగులకు 7 అంశాలకు సంబంధించి నిర్దేశించిన బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్రం, మలేరియా, డెంగీ, గళ్ల పరీక్షలు చేయాలన్నారు. మెడికల్ క్యాంపులకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నందున గ్రామ సచివాలయాల్లో కాకుండా స్కూళ్లలో కానీ, పెద్దగా ఆవరణం ఉన్న ప్రాంతాల్లో కానీ ఏర్పాటు చేయాలన్నారు. వలంటీర్లు, మహిళా పోలీసులు, ఆశాలు, పంచాయతీ సెక్రటరీలకు క్యూ నిర్వహణ విధులు అప్పగించాలన్నారు. షామియానా, మంచినీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. క్యాంపుల్లో న్యూట్రీషన్ కియోస్క్‌తో పాటు పిల్లలకు ఎత్తు, బరువు, రక్తహీనత పరీక్షలు, పిల్లలతో పాటు మహిళలకు కూడా నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి చైతన్యం కలిగించేలా కరపత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. వెయింటింగ్‌లో ఉన్న రోగులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా వీడియోలు చూపించాలన్నారు. శనివారం ఉదయం 8.30 గంటలకు క్యాంప్‌లు ప్రారంభం కావాలని ఆదేశించారు. అంతకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, కర్నూలు మేయర్ బీవై రామయ్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, ఐసీడీఎస్ పీడీ వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

కర్నూలు(హాస్పిటల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడి ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీ సంజీవ్‌కుమార్ అన్నారు. ఇందులో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో వినూత్నమైనదని చెప్పారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏడు రకాల వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని పరిష్కరించునున్నట్లు తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రైవేటు ఆసుపత్రిలో కంటే మెరుగైన వైద్యపరికరాలు ఉన్నాయని అన్నారు. ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులు, గోల్డ్ మెడలిస్ట్‌లు ఉన్నారని, ఇక్కడ అందిస్తున్న వైద్యసేవలు మరెక్కడా లభించవన్నారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మ విజయశ్రీ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఇక్బాల్ హుసేన్, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవకుమార్

2న జంతు వధ నిషేధం

కర్నూలు (టౌన్): అక్టోబర్ 2 వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని జంతువధ నిషేధం ఉంటుందని, ఆ రోజు మాంసం విక్రయాలు, మాంసం అంగళ్లు మూసి వేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసం విక్రయాలు చేపట్టరాదన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి భారీ జరిమానా విధించడంతో పాటు వ్యాపార లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

బిల్లులు కట్టని కనెక్షన్లు కట్ చేయండి

- రేపు ఉదయం నుంచే ప్రక్రియ ప్రారంభించాలి
- విద్యుత్ ఎస్ఈ ఎం. ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు చెల్లించని కనెక్షన్లను ఆదివారం ఉదయం నుంచి కట్ చేయాలని, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్.ఈ. ఎం. ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లుల వసూలులో కొందరు ఏఈలు, లైన్‌మెన్లు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని, ఇది సరి కాదని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మొదలు జూనియర్ లైన్‌మెన్ వరకు ప్రతి ఒక్కరూ బకాయిల వసూలుపై ప్రణాళికలు రూపొందించుకొని, శనివారం సాయంత్రంలోపు 100శాతం కలెక్షన్ చేయాలన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇంకా రూ.12కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని, వినియోగదారులు సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు.

వైఎస్ఆర్‌సీపీ కర్నూలు క్లస్టర్ అధ్యక్షులు నియామకం


ఎస్. మహబూబ్ బాషా, క్లస్టర్-1.


మాదారపు కేదార్‌నాథ్, క్లస్టర్-2


ఆదిమోహన్‌రెడ్డి, క్లస్టర్-3

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు క ర్నూలు నియోజకవర్గంలో క్లస్టర్ అధ్యక్షులను నియమి ంచినట్లు కేంద్ర కార్యాల యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కర్నూ లు క్లస్టర్-1కు ఎస్.మహబూబ్ బాషా, క్లస్టర్-2కు మాదారపు కేదార్‌నాథ్, క్లస్టర్-3కు ఆదిమోహన్ రెడ్డిని అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ప్రకటించింది.రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఇప్పటి నుంచే కార్యకర్తలను స మన్వయం చేసుకుంటూ పనిచేయాలని వారికి సూచించింది.

కల్లూరు: పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్ వార్డులకు సంబంధించి క్లస్టర్-1కు బి. భీమ శంకర్‌రెడ్డి, క్లస్టర్-2గా సాన శ్రీనివాసులును అధ్యక్షులుగా నియమించింది.

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం


డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డికి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్డియోథొరాసిక్ విభాగంలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్డియోథొరాసిక్ సర్జన్‌గా పేద రోగులకు అందించిన వైద్యసేవలకు గాను తనకు ఈ పురస్కారం అందజేసినట్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జనవిజ్ఞానక వేదిక జాతీయ అధ్యక్షుడు వెన్నపూస బ్రహ్మానందరెడ్డి, తరిమెల అమర్నాథరెడ్డి, మానవతా స్వచ్ఛంద సంస్థ(అనంతపురం), తెలుగు వెలుగు స్వచ్ఛంద సేవా సంస్థ(అనంతపురం) ప్రతినిధులు పాల్గొన్నారు.

శనగల కేటాయింపుపై హర్షం

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం జిల్లాకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు భారీగా శనగ విత్తనాలు కేటాయించడం శుభపరిణామమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి తెలిపారు. ముందస్తు రబీ కోసం 53444 క్వింటాళ్లు, రబీ కోసం 13650 క్వింటాళ్లు మొత్తం జిల్లాకు 67094 క్వింటాళ్లు కేటాయించడం విశేషమని ఆయన శుక్రవారం విలేకర్లకు తెలిపారు. సాధారణంగా అయితే ప్రతి అక్టోబరు మొదటి వారం తర్వాత శనగ విత్తనాలు పంపిణీ చేస్తారని, ఈ సారి ముందస్తు రబీ కోసం 10 రోజులు ముందుగానే విత్తన పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. ఈ ఏడాది ఎకరాకు 40 కిలోల ప్రకారం 40 శాతం సబ్సిడీపై గరిష్ఠంగా 5 ఎకరాలకు విత్తనాలు ఇస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలి

కర్నూలు సిటీ: పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంత రావు సూచించారు. శుక్రవారం స్థానిక సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశీలన, సమాచార సేకరణ, విశ్లేషణ, సృజనాత్మకత శక్తిని పెంచాలన్నారు. అనంతరం జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ మాట్లాడుతూ పర్యావరణం, సహజ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ సబ్జెక్టు నిపుణుడు కేవీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా నిలవడం అభినందనీయం


దివ్యాంగుడికి కృత్రిమ అవయవాలు అందజేస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్, బీవీపీ సభ్యులు

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ అభాగ్యులకు అండగా నిలవడం అభినందనీయమని కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వీఆర్ కాలనీలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాల అమరిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కృత్రిమ అవయవాల అందజేత ద్వారా వికలాంగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ మాట్లాడుతూ 109 మంది దివ్యాంగులకు రూ.12 లక్షల విలువ చేసే కృత్రిమ అవయావాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో బీవీపీ తుంగభద్ర శాఖ అధ్యక్షుడు లక్ష్మణస్వామి, కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, కోశాధికారి సతీష్‌కుమార్, తిరుపతి ప్రాంత అధ్యక్షుడు బీవీ బాలసుబ్రమణ్యం, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, బీవీపీ సభ్యులు రఘు, పెరుమాళ్ల దత్తయ్య, దాతలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు నిధుల సర్దుబాటు


మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చేందుకు నాడు-నేడు కింద చేపడుతున్న పనులకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్, ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీర్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో మన బడి నాడు-నేడు పనులపై ఎంఈఓ, ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు మొదటి విడత కింద చేపట్టిన పనుల్లో రూ.3.5 కోట్లు, రెండో విడతలో రూ.12 కోట్లు ప్రస్తుతం తల్లిదండ్రుల ఖాతాల్లో నిల్వ ఉందన్నారు. ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో స్కూళ్లలో అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ పనులు పూర్తికి సర్దుబాటు చేస్తామన్నారు. తరగతి గదుల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన స్టీల్ ఏదైనా మిగిలిపోయి ఉంటే దాన్ని అవసరమైన పాఠశాలలకు బదిలీ చేసుకోవాలని వారు సూచించారు. కొందరు ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో ఉన్న మిగులు నిధులను బదిలీ చేయడానికి విముఖత చూపుతున్నారన్నారని కొందరు ఎంఈఓలు ఆయన దృష్టికి తీసుకురాగా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ మనోహర్, డీఈఈ, ఏఈఈ, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగ సమస్యలను అలసత్వం చేయొద్దు



ర్యాలీలో ఎంపీ డాక్టర్ సంజీవకుమార్

కర్నూలు(హాస్పిటల్): హృద్రోగ సమస్యలను అలసత్వం చేయొద్దని కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎస్. సంజీవకుమార్ చెప్పారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక రాజవిహార్ నుంచి కలెక్టరేట్ వరకు 2కే వాక్ నిర్వహించారు. అనంతరం ఐ అండ్ పీఆర్ కార్యాలయం వద్ద జర్నలిస్టులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజీవకుమార్ మాట్లాడుతూ మన హృదయాన్ని పదిలంగా ఉంచుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. మారుతున్న జీవనశైలికి తగ్గట్లుగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. నిరంతరం పనిచేస్తున్న గుండె కోసం మనం ప్రతిరోజూ ఒక గంట సమయాన్ని కేటాయించి తప్పకుండా చురుకైన నడక, వ్యాయామం చేయాలని చెప్పారు. కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ తక్కువ వయస్సుగల వారు కూడా గుండె సంబంధిత సమస్యల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ డాక్టర్స్ విభాగం జనరల్ సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కిమ్స్ కర్నూలు సీఈవో డాక్టర్ సునీల్ సేపూరి తదితరులు పాల్గొన్నారు.

జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో...

ప్రపంచ హృద్రోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్డియాలజిస్టులు డాక్టర్ రాఘవేంద్ర చెరకు, సీటీవీఎస్ సర్జన్ డాక్టర్ సుధీర్‌కుమార్, కార్డియాక్ అనెస్తీషియా వైద్యులు డాక్టర్ కె. ఆదిత్య చికిత్స అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సీఈవో డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్, డాక్టర్ జీవీఎస్. రవిబాబు, సీవోవో డాక్టర్ గణేష్, మార్కెటింగ్ హెడ్ రమణబాబు, ఆపరేషన్స్ హెడ్ నదీమ్, డేనియల్ రాజు ఫౌండేషన్ అధ్యక్షులు సుమన్ పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో...

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆకస్మిక కార్డియాక్ డెత్‌లు ఎక్కువయ్యాయని, మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లే దీనికి కారణమని వారు చెప్పారు. కార్యక్రమంలో కార్డియాలజిస్టులు డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ తేజానందన్‌రెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక ఎ. క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో ప్రపంచ హృద్రోగ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ మాట్లాడుతూ నానాటికీ పెరిగిపోతున్న గుండె జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేలూరు సీఎంసీ కార్డియాలజిస్టు డాక్టర్ జార్జ్ జోసఫ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి గుండె పనితీరు గురించి సమగ్రంగా అవగాహన పెంచుకోవాలన్నారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, పోతన, అంబేద్కర్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): క్రీడల్లో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో వెయిట్ లిఫ్టింగ్, త్రోబాల్, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్‌తక్రా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాలురతో పోటీ పడుతూ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బాలికలు బాలురతో పోటీ పడి రాణించడం శుభపరిణామమన్నారు.ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 300 మంది బాల బాలికలు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు.

జూడో పోటీలు వాయిదా

అక్టోబర్ 3 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన జూడో పోటీలు అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే తేదీలను ప్రకటిస్తామని క్రీడాకారులు గమనించాలని తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

కర్నూలు (టౌన్) : ఆత్మరక్షణకు కరాటే సాధన అవసరమని కేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కేవీఆర్ డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మోటార్ సైకిళ్ల నేరస్తుడికి జైలు శిక్ష

కర్నూలు కల్చరల్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు, ల్యాప్ ట్యాప్‌లు, మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడిన నిందితుడికి శిక్ష పడింది. వివరాలను కర్నూలు ఐఆర్‌పీ ఎస్.అశోక్ కుమార్, ఆర్‌పీఎస్ఐ జి.సురేష్ బాబు వెల్లడించారు. నంద్యాల టౌన్ నూనెపల్లికి చెందిన గొల్ల నరసయ్య కుమారుడు గొల్ల సంతోష్ (28 సంవత్సరాలు), ప్రకాశం జిల్లా పెద్ద ఆరవీడు మండలం, బద్వీడు గ్రామానికి చెందిన ఈడిగ వెంకట రామాంజినేయులు కుమారుడు ఈడిగ బత్తుల రామకృష్ణ (22 సంవత్సరాలు) ను కర్నూలు ఆర్‌పీఎస్ సీఆర్ నెం. 28/2022, యు/ఎస్ 379 ఐపీసీ కేసులో డిసెంబర్ 13, 2022లో కర్నూలులో అరెస్ట్ చేశారు. వారు వివిధ ప్రదేశాల్లో దొంగిలించిన 77 మొబైల్ సెల్ ఫోన్‌లను, 5 ల్యాప్ ట్యాప్‌లు, 9 మోటార్ సైకిళ్లను నంద్యాలలో దాచి ఉంచినట్లు విచారణలో గుర్తించారు. చోరీ చేసిన వస్తువుల విలువ రూ. 13,33, 000 ఉంటుంది. శనివారం గొల్ల సంతోష్‌ను జైల్ నుంచి గుంతకల్ రైల్వే కోర్టు ముందు హాజరు పరచగా 9 నెలలు జైలు శిక్ష విధించినట్లు వారు వెల్లడించారు.

పేదరికాన్ని పారద్రోలడమే సీఎం లక్ష్యం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్


మాట్లాడుతున్న ఎం. సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): పేదరికాన్ని రాష్ట్రం నుంచి పారద్రోలడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ భవనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ముఖ్య నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి సంబంధించి శుక్రవారం ఐదవ విడత నగదును ఆటో డ్రైవర్ల ఖాతాల్లో జమ చేయడంతో వారు ఎంతో సంతోష పడుతున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా ఎంతో పవిత్రంగా భావించి ఇచ్చిన హామీలన్నింటిని నేరవేరుస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టనటువంటి సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ చేపడుతున్నారని, ఆయా సంక్షేమ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు రెండు లక్షల ముప్పై ఐదు వేల కోట్ల రూపాయలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. వైఎస్ జగన్ పాలనను రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలంతా స్వర్ణయుగంలా భావిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గతంలో కంటే అత్యధిక మెజారిటీతో తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, మైనారిటీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు యూనస్‌బాషా, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య, మహిళా నేత జమీల మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేక ప్రతిపక్ష పార్టీలు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయన్నారు. ప్రజల మద్దతు మెండుగా ఉన్న వైఎస్ జగన్ విజయాన్ని ఆపే ధైర్యం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్‌కు లేదన్నారు. అనేక అవినీతి కేసుల్లో కూరుకుపోయిన చంద్రబాబు, లోకేష్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు కూడా లేదన్నారు.

ఢిల్లీకి వెళ్లిన 'స్థానిక' ప్రజా ప్రతినిధులు


ఢిల్లీకి బయలుదేరిన జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓ, ఎంపీపీలు

కర్నూలు(అర్బన్): దేశ రాజధాని ఢిల్లీ లోని భారత మండపంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న ఆస్ప్రేషన్ బ్లాక్స్ ప్రొగ్రామ్‌లో పాల్గొనేందుకు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి, పలువురు స్థానిక సంస్థలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. సంకల్ప్ సప్త్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని ఆశించి (విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ప్రజల జీవన ప్రమాణాలు తదితరాలు) చేపట్టాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలోని మద్దికెర, హొళగుంద, చిప్పగిరి మండలాలకు చెందిన అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలోనే జెడ్పీ సీఈఓ, ఆయా మండలాలకు చెందిన ముగ్గురు ఎంపీడీఓ, ఎంపీపీలు, ఒక్కో మండలం నుంచి ఎంపిక చేసిన సర్పంచులు ఢిల్లీకి బయలుదేరారు.

నేడు వర్చువల్‌గా ప్రధాని సందేశం ...

ఢిల్లీలో నేడు (శనివారం) జరగనున్న ఆస్ప్రేషన్ బ్లాక్స్ ప్రొగ్రామ్‌కు ప్రధాని నరేంద్రమోదీ హాజరై వర్చువల్‌గా సందేశం ఇవ్వనున్నారని జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని సందేశాన్ని వినేందుకు జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలుకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ డా.జీ సృజన ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే చిప్పగిరి, మద్దికెర, హొళగుంద మండల కార్యాలయాలు, ఆయా మండలాల్లోని ఎంపికైన గ్రామ పంచాయతీల్లో కూడా వర్చువల్ సందేశాన్ని వినేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు.